
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 4 । నవంబర్ । 2023



సోమశిలలో 30 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 30 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 22 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	- రూ.63,000
22 క్యారెట్లు ఆర్నమెంటు (గ్రా)	-రూ.5,658
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,828
సవర (8 గ్రా)	- రూ.46,624

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.6 /26.0

శుక్రవారం గాలిలో తేమ 85 శాతం ఉంది. జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. శనివారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



ఒక పేద కుటుంబంలోని వ్యక్తి తీవ్రమైన అనారోగ్యంతో, దీర్ఘకాలిక వ్యాధులతో మంచాన పడితే వైద్యం చేయించుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఇలా అనారోగ్యంతో చికిత్స చేయించుకునేందుకు డబ్బులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వైఎస్సార్ హెల్త్ పెన్షన్‌ను అందజేస్తూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది.

- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైఎస్సార్ హెల్త్ పెన్షన్
- వ్యాధిని బట్టి నెలకు రూ.3 వేల నుంచి రూ.10 వేలు
- ప్రతి నెలా లబ్ధిదారులకు రూ.10.20 కోట్ల పంపిణీ
- జిల్లాలో 2,107 మంది లబ్ధిదారులు

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసింది. అందులో భాగంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. గతంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించినట్లే.. ప్రస్తుతం ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంతోపాటు 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. వీటితోపాటు అనారోగ్యంతో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ పెన్షన్ అందిస్తూ ఆసరాగా నిలుస్తోంది. గతంలో కేవలం దివ్యాంగులకు మాత్రమే పింఛన్ అందజేసేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర సమయంలో దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారి అవస్థలను ప్రత్యక్షంగా చూశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని ఆదుకొనేందుకు వైఎస్సార్ హెల్త్ పెన్షన్ పథకాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. తద్వారా వ్యాధిని బట్టి నెలకు లబ్ధిదారుడికి రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ప్రతి నెలా పింఛన్ అందజేస్తున్నారు.

ప్రభుత్వం అండగా నిలుస్తోంది



ఇతని పేరు గుండుబోయిన రాజయ్య. పక్షవాతంతో బాధపడుతున్నాడు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం గ్రామ నివాసి. గత ప్రభుత్వాల్లో ఇతనికి ఎలాంటి సాయం అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజయ్యకు ప్రతి నెలా ఒకటో తేదీన రూ.5 వేల చొప్పున వైఎస్సార్ హెల్త్ పెన్షన్‌ను వలంటీర్లు అతని ఇంటికే తెచ్చిస్తున్నారు. తనలాంటి బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవడం చాలా సంతోషంగా ఉందని రాజయ్య చెబుతున్నాడు.

జీవితాంతం రుణపడి ఉంటాం



ఇతని పేరు నాశిన చైతన్య. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం గ్రామం. ఇతను తలసేమియా వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. వైఎస్సార్ హెల్త్ పెన్షన్ పథకంలో భాగంగా చైతన్యకు ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ద్వారా రూ.10 వేలు అందజేస్తోంది. తనకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తాను, తన తల్లిదండ్రులు జీవితాంతం రుణపడి ఉంటామని చైతన్య చెబుతున్నాడు.



తలసేమియా బాధితుడు నాశిన చైతన్యకు రూ.10 వేలు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

వ్యాధి తీవ్రతను బట్టి..

జిల్లాలో వైఎస్సార్ హెల్త్ పెన్షన్‌కు సంబంధించి ఉన్నతాధికారులు దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి నిజమైన బాధితులకు అండగా నిలుస్తున్నారు. 2020లో ప్రారంభమైన వైఎస్సార్ హెల్త్ పెన్షన్ పథకం ద్వారా జిల్లాలో 2,107 మంది లబ్ధిదారులకు నగదు అందజేస్తున్నారు. కుష్టువ్యాధిగ్రస్తులకు తీవ్రతను బట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేలు పింఛన్ ఇస్తుండగా, కిడ్నీ, లివర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులకు, కిడ్నీ బాధితులు (సీరమ్ క్రియాటిన్ 5 ఎం.ఎం. కన్నా ఎక్కువ ఉన్న వారికి), తీవ్ర కండరాల సమస్యతో బాధపడే వారికి, ప్రమాదానికి గురై మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి, పక్షవాతంతో మంచం పట్టిన వారికి, బోధకాలు (రెండు కాళ్లకు) ఉన్న వారికి నెలకు రూ.5 వేల చొప్పున ప్రభుత్వం పింఛన్ అందజేస్తోంది. తలసేమియా మేజర్, సికెల్ సెల్, సివియర్ హీమోఫీలియా (2 శాతం పైబడి) ఉన్న వారికి నెలకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం ప్రతి నెలా పంపిణీ చేస్తోంది.

జిల్లాలో వైఎస్సార్ హెల్త్ పెన్షన్ వివరాలు

రూ.10 వేలు అందుకొనే రోగులు	
తలసేమియా	48
సికెల్ సెల్	9
సివియర్ హీమోఫీలియా	36
రూ.5 వేలు అందుకొనే వారు	
బోధకాలు	101
కిడ్నీ వ్యాధిగ్రస్తులు (డయాలసిస్ లేనివారు)	74
పక్షవాతం బాధితులు	914
కుష్టు వ్యాధిగ్రస్తులు (తీవ్రతను బట్టి)	400
కిడ్నీ, లివర్, గుండె సంబంధిత రోగులు	51
రూ.3 వేలు అందుకొనే వారు	
40 శాతం కన్నా అంగవైకల్యం ఎక్కువ ఉన్న వారు	474 మంది

సదరమ్ సర్టిఫికెట్‌తో పెన్షన్

పక్షవాతం, కండరాల క్షీణత, ప్రమాదాల బారిన పడి మంచానికే పరిమితమైన రోగులకు ప్రభుత్వం సదరమ్ సర్టిఫికెట్ అందజేసి పెన్షన్ మంజూరు చేస్తోంది. మిగిలిన వ్యాధులకు సంబంధించి తొలుత మెడికల్ బోర్డులోని కమిటీ రోగ ధ్రువీకరణ చేస్తుంది. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు సోషల్ ఆడిట్ చేసి వ్యాధిని నిర్ధారించి అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని రోగులకు అందజేస్తారు. ధ్రువీకరణ పత్రంతోపాటు రోగులకు సంబంధించిన ఆధార్, బియ్యంకార్డు, బ్యాంక్ ఖాతా పాస్‌పుస్తకం తదితర వివరాలతో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని వైఎస్సార్ హెల్త్ పెన్షన్ విభాగంలో దరఖాస్తు అందజేయాలి. అందిన దరఖాస్తులను వారు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు అప్‌లోడ్ చేస్తారు. అక్కడి నుంచి సెర్ప్‌కు వెళ్లి పెన్షన్ మంజూరై సంబంధిత సచివాలయానికి వెళుతుంది. అనంతరం సచివాలయాల్లోని వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం పెన్షన్ అందజేస్తోంది.

అనారోగ్యంతో ఉన్న వారికి చేయూత



దీర్ఘకాలిక అనారోగ్యం, ప్రమాదాల బారిన పడి నడవలేని స్థితిలో సాధారణ జీవనం గడపలేని వారికి ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ పెన్షన్ ద్వారా చేయూతనిస్తోంది. వ్యాధి నిర్ధారణకు సంబంధించి సదరమ్ మెడికల్ బోర్డు పారదర్శకంగా పనిచేసేలా పక్కాగా చర్యలు తీసుకుంటున్నాం. నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ఈ పెన్షన్ నిజమైన రోగులకు అందించడమే లక్ష్యం.

– డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

న్యూస్‌రీల్

వైఎస్సార్ పెన్షన్ కానుక 95.97 శాతం పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. మూడో రోజు శుక్రవారానికి 95.97 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ నగదును వలంటీర్లు అందజేశారు. జిల్లాలోని మొత్తం 3,16,617 మంది లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు 3,03,861 మందికి పింఛన్ నగదు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌కు సేవా పతకం



జీఎల్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పోలీసు, విజిలెన్స్, ఫైర్, ఏసీబీ తదితర విభాగాల్లో విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి మహోన్నత, ఉత్తమ, సేవా పతకాలను ప్రకటించింది. అందులో భాగంగా నెల్లూరు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాసరావు సేవాపతకానికి ఎంపికయ్యారు. అంకితభావంతో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకుగాను ఆయనకు ఈ పతకం అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఏసీబీ డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్, సహచర ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది అభినందించారు.

ఎస్‌ఈఏఎస్ సర్వే సంతృప్తికరం

- డీఈఓ గంగాభవాని



అదానీ స్కూల్‌లో సర్వే పరీక్షను పరిశీలిస్తున్న డీఈఓ గంగాభవాని తదితరులు

ముత్తుకూరు: మండలంలో 'స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎస్‌ఈఏఎస్)' పరీక్ష సంతృప్తికరంగా జరుగుతోందని డీఈఓ గంగాభవాని తెలిపారు. మండలంలోని ముత్తుకూరు, బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూళ్లు, గురుకుల పాఠశాల, అదానీ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో జరిగిన సర్వే పరీక్షను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మధుసూదన్ మాట్లాడుతూ ముత్తుకూరు మండలంలో 43 ప్రభుత్వ పాఠశాలల్లో సర్వే పరీక్ష జరుగుతున్నట్లు తెలిపారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులు సుమారు 800 మంది ఈ సర్వే పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునేందుకు ఈ పరీక్ష ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రెండో యూనిట్‌లో విద్యుదుత్పత్తికి బ్రేక్

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్‌లో 390 మెగావాట్లు, 3వ యూనిట్‌లో 470 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాల వల్ల 2వ యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేసినట్లు తెలిపారు.

నేటి నుంచి సబ్సిడీపై ఉల్లి

- నెల్లూరు ఫతేఖాన్‌పేట, నవాబుపేట రైతుబజార్లలో విక్రయాలు

నెల్లూరు(సెంట్రల్): పెరుగుతున్న ఉల్లి ధరలు తగ్గే వరకు ప్రభుత్వం సబ్సిడీపై విక్రయించనున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తెలిపారు. నెల్లూరులోని ఫతేఖాన్‌పేట, నవాబుపేట రైతు బజార్లలో కిలో రూ.40 చొప్పున ఒకరికి రెండు కిలోలు విక్రయించనున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ విక్రయాలు జరుపుతామని తెలిపారు. ఉల్లి ధరలు తగ్గే వరకు ప్రజలపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

10న డయల్ యువర్ డీఎం

నెల్లూరు(సిటీ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రధాన కార్యాలయం విజయవాడ వారి ఉత్తర్వుల మేరకు నెల్లూరు ఆర్టీసీ కార్యాలయంలో ప్రతి నెలా 10వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నెల్లూరు–2 డిపో మేనేజర్ శివకుమార్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నెల్లూరు–2 డిపో నుంచి నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రజలు, ప్రయాణికులు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు అందించవచ్చని తెలిపారు.

ఏసీబీ తనిఖీలు

- అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో లైసెన్స్‌లపై ఆరా

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని చంద్రమౌళినగర్‌లో ఉన్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వారి రాకతో కార్యాలయ అధికారులు, సిబ్బంది బెంబేలెత్తారు. జిల్లావ్యాప్తంగా ఫుడ్ లైసెన్సులు ఎన్ని ఉన్నాయి.. ఎన్ని రెన్యువల్ అయ్యాయి.. నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారా.. ఎన్ని శాంపిల్స్ సేకరించారు.. కల్తీ విక్రయాలపై కేసులు నమోదు చేశారా.. ఎంతెంత జరిమానాలు విధించారు.. కాలపరిమితి తీరిన లైసెన్సుల పునరుద్ధరణ తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకుని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్యాకేజీ, లేబులింగ్ తదితర లైసెన్సులున్న వ్యాపారులు ఆదాయపు పన్ను చెల్లిస్తేనే వారి లైసెన్సులు రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. పన్నులు చెల్లించకుండానే లైసెన్సులు రెన్యువల్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు జరుగుతున్నాయని సమాచారం. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే తనిఖీలు చేస్తున్నామన్నారు. రికార్డులన్నింటినీ పరిశీలిస్తున్నామని, ఇప్పటి వరకు ఎలాంటి అవకతవకలు బయటపడలేదని తెలిపారు. తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ తనిఖీల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు జీఎల్ శ్రీనివాసరావు, కిరణ్, విజయకుమార్, అంజనేయరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆది వారాల్లో బూత్ లెవల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఉండి ఓటరు నమోదు ప్రక్రియ నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారని, బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి ముసాయిదా ఓటర్ల జాబితా, ఫాం– 6, 7, 8లతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఓటర్లు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవచ్చని తెలిపారు.

జగనన్న మళ్లీ అధికారంలోకి రావాలి

- స్కూటర్‌పై పాస్టర్ రాష్ట్ర పర్యటన



స్కూటర్‌పై ఆత్మకూరులో పర్యటిస్తున్న రాజు

ఆత్మకూరు: రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాలని ఆకాంక్షిస్తూ ఓ పాస్టర్ రాష్ట్రవ్యాప్తంగా స్కూటర్‌పై పర్యటిస్తూ తన అభిమానాన్ని చాటుకుంటున్నారు. జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన పాస్టర్ అడవికొట్టు రాజు తన స్కూటర్‌కు వైఎస్సార్‌సీపీ జెండాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోస్టర్‌ను ఏర్పాటు చేసుకుని రాష్ట్రమంతా పర్యటిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఆత్మకూరు పట్టణంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని కలిసి తన పర్యటన ముఖ్య ఉద్దేశాన్ని తెలుపగా ఎమ్మెల్యే ఆయనను అభినందించారు.

డీసీఎమ్మెస్‌లో అధికారుల తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్(డీసీఎమ్మెస్)లో ఎరువుల విక్రయాలలో జరిగిన గోల్‌మాల్‌పై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'డీసీఎమ్మెస్‌లో నిధుల గోల్‌మాల్' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో స్పందించిన జిల్లా సహకారశాఖ అధికారిణి సుధాభారతి నలుగురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. 2021–22 సంవత్సరంలో డీసీఎమ్మెస్ ద్వారా నిర్వహించిన అన్ని ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి 5 రోజుల్లో సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం విచారణ కమిటీ సభ్యులు డీసీఎమ్మెస్ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు.

గ్లాసు.. తిరకాసు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ – జనసేన పొత్తు ఖరారు కావడంతో నూతన జిల్లాలో జనసేన స్థానం ఎక్కడనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ పొత్తు టీడీపీ నేతల్లో ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో రెండు పార్టీల ఉనికి అంతంత మాత్రంగానే ఉన్న నేపథ్యంలో ఎవరు ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే దానిపై స్పష్టత లేదు. దీనిపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

- జిల్లాలో టీడీపీ – జనసేన మధ్య పొత్తు కుంపటి
- జనసేనకు ఏ నియోజకవర్గం ఖరారు చేస్తారనేది ప్రశ్నార్థకం
- జిల్లాలో ఆ పార్టీ బలం నామమాత్రమే
- ఎవరు సీటు త్యాగం చేయాల్సి వస్తుందోనని టీడీపీ నేతల్లో ఆందోళన


సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రస్తుతం జిల్లాలో తెలుగుదేశం, జనసేన పార్టీలు తమ ఉనికి కోసం పోరాడుతున్నాయి. ప్రస్తుతం ఏ నియోజకవర్గంలోనూ ఆ రెండు పార్టీలకు ఆశించిన స్థాయిలో ప్రజల మద్దతు లేదని తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన తెలుగుదేశం పార్టీ, 2024 సార్వత్రిక ఎన్నికల్లో తన ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో తెలుగుదేశం – జనసేన పార్టీల మధ్య కుదిరిన పొత్తు ద్వారా బలం పెంచుకోవాలని భావిస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఈ పొత్తు జిల్లాలో వికటించే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఏ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఆ రెండు పార్టీల అధిష్టానాలు కూడా దీనిపై ఇంకా ఒక ఒప్పందానికి రాకపోవడంతో రెండు పార్టీల్లోనూ సీట్లు సర్దుబాటుపై ఆందోళన కొనసాగుతోంది. అదే సందర్భంలో మొదటి నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ, కచ్చితంగా టికెట్ వస్తుందని ఆశతో ఉన్న టీడీపీ ఇన్‌చార్జిలను పొత్తు భయం వెంటాడుతోంది. తమ స్థానాలను జనసేనకు కేటాయిస్తే పరిస్థితి ఏంటని వారు అయోమయంలో ఉన్నారు.

ఆందోళనలో టీడీపీ నేతలు

జిల్లాల పునర్విభజన తరువాత ప్రస్తుతం జిల్లా 8 నియోజకవర్గాలకు పరిమితమైంది. జిల్లాలోని నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజకవర్గాల్లో ఒకటి, రెండు నియోజకవర్గాలు మినహా జనసేన ప్రభావం పెద్దగా లేదు. పైగా అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రస్తుతం ఆ పార్టీకి అభ్యర్థులు కూడా లేరు. దీంతో ఏ నియోజకవర్గం జనసేనకు కేటాయిస్తారనేది ప్రశ్నార్థకంగా ఉంది. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం మనుక్రాంత్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఆ పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నాదెండ్ల మనోహర్‌తో ఉన్న అనుబంధం, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నేపథ్యంలో ఆయన ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ తరఫున నియోజకవర్గ ఇన్‌చార్జిలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. మరి ఎవరి ఆశలపై గ్లాసు నీళ్లు చల్లుతుందోనని టీడీపీ నేతల్లో ఆందోళన కొనసాగుతోంది.

ఆ నాలుగింటిపైనే గ్లాసు ఆశలు

జనసేన పార్టీ ప్రస్తుతం నెల్లూరు సిటీ, కోవూరు, కావలి, సర్వేపల్లి నియోజకవర్గాలపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో బీఎస్పీ, జనసేన కలిసి నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, కోవూరు, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో పోటీ చేశాయి. ఒక్క కావలి మినహా మరెక్కడా పెద్దగా ప్రభావం చూపలేదు. కావలిలో కూడా అభ్యర్థి ధనబలమే బాగా పనిచేసిందని సమాచారం. మిగిలిన నియోజకవర్గాల్లో ఎక్కడా కూడా పోటీ ఇవ్వలేక గ్లాసు గల్లంతైంది. ప్రస్తుతం టీడీపీ – జనసేన పొత్తులో జిల్లాకు ఒక సీటు జనసేనకు కేటాయించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఇప్పటికే నెల్లూరు సిటీలో టీడీపీ టికెట్ నాదే అని పొంగూరు నారాయణ అంటున్నారు. నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి టికెట్ ఇస్తున్నట్లు చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. కోవూరులో పోలంరెడ్డి దినేష్, కావలిలో సుబ్బానాయుడుతోపాటు మరో ఇద్దరు వలస నేతలు టికెట్ మాదేనంటూ హడావుడి చేస్తున్నారు. ఇక జనసేనలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డికి అధిష్టానం ఆశీస్సులుంటే నెల్లూరు నగరం కేటాయించే అవకాశం ఉంది. ఒకవేళ పొంగూరు నారాయణ ప్రతిఘటిస్తే సర్వేపల్లి కేటాయించే అవకాశం ఉంది. సర్వేపల్లిలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి బాగాలేదు. వరుస ఓటములతో ఉన్న వారికి టికెట్ ఇవ్వబోమని చినబాబు లోకేశ్ తెగేసి చెప్పిన సంగతి తెలిసిందే. ఒకవేళ సోమిరెడ్డికి టికెట్ రాకపోతే ఆయన కుమారుడికి సీటు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీ ధాటికి సైకిల్ ఓడిపోయే అవకాశం ఉండడంతో దానిని జనసేనకు వదిలే అవకాశం ఉంది. అంతేకాక సోమిరెడ్డికి నెల్లూరు పార్లమెంట్ టికెట్ ఇచ్చి పోటీ చేయించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.



సీతాకోకచిలుకల సందడి

గత నాలుగు రోజులుగా కొద్దిపాటి జల్లులు పడుతుండడంతో పచ్చని చెట్లపై రంగురంగుల సీతాకోకచిలుకలు సందడి చేస్తున్నాయి. నలుపు రెక్కలపై తెలుపు చుక్కల తోనూ.. తెలుపు, గోధుమ వన్నెల తోనూ.. పసుపుపచ్చ రంగులోనూ చెట్ల కొమ్మలపై వాలి కనువిందు చేస్తున్నాయి. నెల్లూరు మూలాపేట ప్రాంతంలో శుక్రవారం కనిపించిన దృశ్యాలివి.

– ఫొటోలు, సాక్షి, ఫొటోగ్రాఫర్







క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



సిబ్బంది సమస్యలను ఆరాతీస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలూ కష్టపడి పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. వివిధ అంశాలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఆరోగ్య, వృత్తిపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏఎస్పీ హిమవతి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ అధికారినంటూ బెదిరింపులు

• రూ.1.5 లక్షల డిమాండ్

నెల్లూరు(క్రైమ్): 'హలో.. నేను ఏసీబీ ఇన్స్పెక్టర్.. మీపై అవినీతి ఆరోపణలొచ్చాయి.. రైడ్ చేయకూడదంటే రూ.1.5 లక్షలివ్వాలి' అంటూ ఓ ఆగంతకుడు ఈఓకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. దర్గామిట్ట పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ఈఓగా వెంకటశ్రీనివాసులురెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీ రాత్రి ఆయనకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశారు. తాను ఏసీబీ ఇన్స్పెక్టర్‌నంటూ పరిచయం చేసుకున్నారు. అవినీతి ఆరోపణలొచ్చాయి.. దాడులు చేయకూడదంటే రూ.1.5 లక్షలను సమర్పించాలి.. లేని పక్షంలో మీ ఇష్టమంటూ కాల్ కట్ చేశారు. దీంతో ఈఓకు అనుమానం వచ్చి విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అపరిచిత వ్యక్తి ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. అయితే సదరు నంబర్ ఏసీబీ అధికారులది కాదని తేలడంతో ఘటనపై పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుడ్ని గుర్తించే పనిలో ఉన్నారు.

చోరీకి వచ్చి.. ఆపై చిక్కి



పట్టుబడిన సాయితేజ

కందుకూరు: ఓ ఇంట్లో చోరీకి వచ్చిన దొంగ తప్పించుకునే క్రమంలో గ్రామస్తులకు చిక్కిన ఘటన పట్టణ పరిధిలోని గనిగుంటలో గల ఎస్టీ కాలనీలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. సింగరాయకొండకు చెందిన ముగ్గురు దొంగలు గనిగుంటలో చోరీకి వెళ్లారు. పల్సర్ బైక్‌ను గ్రామానికి కొంచెం దూరంలో పొలాల్లో పెట్టి కాలనీలోకి వచ్చారు. అనంతరం చేబ్రోలు సుబ్బారావు ఇంట్లోకి ముగ్గురు చొరబడి, ట్రంక్‌పెట్టెను అపహరించారు. పారిపోయే క్రమంలో అలికిడి రావడంతో నిద్రలేచిన సుబ్బారావుతో పాటు మరికొందరు యువకులు దొంగల వెంటపడ్డారు. అయితే పెట్టెతో సహా ఇద్దరు తప్పించుకోగా, ఒక దొంగ గ్రామస్తులకు దొరికిపోయాడు. వారు తీసుకొచ్చిన పల్సర్ బైక్‌ను కాలనీ వాసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సాయితేజ, బైక్‌ను తీసుకొచ్చారు. దొంగను గ్రామంలో రాత్రంతా చెట్టుకు కట్టి ఉంచారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు గ్రామానికి శుక్రవారం వెళ్లి సాయితేజను అదుపులోకి తీసుకున్నారు. పరారైన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దొంగలు ఎత్తుకెళ్లిన పెట్టెలో దాదాపు రూ.90 వేల వరకు నగదు ఉందని యజమాని సుబ్బారావు తెలిపారు.

సేల్స్‌మెన్‌కు షోకాజ్ నోటీస్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీసీఎమ్మెస్‌లోని ఎరువుల దుకాణంలో సేల్స్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తికి షోకాజ్ నోటీస్‌ను జారీ చేశామని డీసీఎమ్మెస్ బీఎం వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఎమ్మెస్ ద్వారా ఎరువుల విక్రయాలు, కొనుగోళ్లలో వచ్చిన నగదులో రూ.5,99,524 మేర దుర్వినియోగమైందనే అంశాన్ని గుర్తించామని చెప్పారు. దీంతో షోకాజ్ నోటీస్‌ను జారీ చేశామని, ఈ విషయమై డీసీఓకు సమాచారం అందించామన్నారు.

కండలేరులో 11.33 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 11.339 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40, పిన్నేరు వాగు, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు ఐదు క్యూసెక్కుల చొప్పున, లో లెవల్ స్లూయిజ్‌కు పది క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

పేదలకు అండగా సీఎం జగనన్న

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సత్కారం అందుకున్న వైద్య సిబ్బందితో ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేలా సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని గాయత్రినగర్‌లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. పేదల జీవితాల్లో వస్తున్న మార్పులను చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా, ప్రజలు తీర్పు తమవైపే ఉంటుందని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల అనంతరం టీడీపీ పూర్తిగా కనుమరుగు కానుందని చెప్పారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్యసేవలందించిన సిబ్బందిని సత్కరించారు. ఎమ్మెల్యే సతీమణి రామిరెడ్డి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి డీసీసీబీ

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: గ్రామీణ ప్రాంతాల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఏఎస్‌పేటలో డీసీసీ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో డీసీసీ బ్యాంక్‌ను శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. బ్యాంక్‌లో డిపాజిటర్లుగా చేరి ఆర్థిక లావాదేవీలు జరుపుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే రూ.నాలుగు వేల కోట్ల టర్నోవర్ జరుగుతోందన్నారు. బ్యాంక్ ఏర్పాటు విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించి ప్రారంభించేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి మండలంలో వీటిని ఏర్పాటు చేయనున్నారని వెల్లడించారు. అతి తక్కువ వడ్డీకే రుణ సౌకర్యాన్ని కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఏటీఎంతో పాటు లాకర్ సౌకర్యం సైతం అందుబాటులో ఉందని చెప్పారు. కేంద్ర సహకార బ్యాంక్ సీఈఓ సరిత, మేనేజర్ సుబ్బారెడ్డి, డీజీఎం మధుసూదన్‌రావు, దయాకర్‌రెడ్డి, జీఎం ఉషారాణి, జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కాటంరెడ్డి నారసింహారెడ్డి, మండల కో ఆప్షన్ సందానీబాషా, జేసీఎస్ కన్వీనర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు జిలానీ, కొల్లా వెంకటేశ్వర్లు, సూరా శ్రీనివాసులు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు టిడ్కో గృహాల పంపిణీ

• 1100 మందికి ఇంటి తాళాలు అందించిన ఎమ్మెల్యే మానుగుంట



టిడ్కో గృహాలను ప్రారంభిస్తున్న మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: పట్టణంలోని ఉప్పు చెరువులో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పక్కన నిర్మించిన టిడ్కో గృహాలను పేదలకు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. పూజలు చేసి గృహాలను ప్రారంభించిన అనంతరం మహిళలకు తాళాలను అందజేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం అరకొర నిర్మాణాలతో సరిపెట్టి వదిలేసిందని, ప్రస్తుతం తమ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు మౌలిక వసతులను కల్పించామని వివరించారు. రివర్స్ టెండరింగ్ ద్వారా కందుకూరు గృహాల్లోనే ప్రభుత్వానికి రూ.60 కోట్ల వరకు మిగిలాయని తెలిపారు. టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతుల కల్పనకు రూ.9.58 కోట్లను ప్రభుత్వం వెచ్చించిందని వివరించారు. రూ.4.89 కోట్లతో ప్రత్యేకంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. మొత్తం 44 బ్లాకుల్లో 1408 గృహాలను పూర్తి చేశారని, దాదాపు 1100 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందజేస్తున్నామని చెప్పారు. విద్యుత్ మీటర్ కోసం ఆ శాఖకు లబ్ధిదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని తానే భరిస్తానని ప్రకటించారు. దరఖాస్తు ఫారాలను పూర్తి చేసిస్తే చాలన్నారు. ఏపీ టిడ్కో చీఫ్ ఇంజినీర్ గోపాలకృష్ణారెడ్డి, టిడ్కో డైరెక్టర్ కానూరి నాగేశ్వరి, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం.. ఆంధ్రా'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల్లో నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' టోర్నీని జిల్లా స్థాయిలో విజయవంతం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో సంబంధిత అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించనున్నారని చెప్పారు. క్రీడల నిర్వహణకు అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉందని, సదుపాయాలపై నివేదికలను ఈ నెల 15లోపు అందజేయాలని కోరారు. జిల్లాలో టోర్నీ నిర్వహణకు అవసరమైన మైదానాలు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక, క్రీడా సామగ్రి పంపిణీ, క్రీడాకారులకు వసతి, భోజన, రవాణా తదితర కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసక్తి గల క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ సమస్యలకు చెక్

• రైతుల సౌకర్యార్థం అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అవకాశం
• ఎస్ఈ విజయన్



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలోని రైతులు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నామని ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో సమీక్ష సమావేశాన్ని నగరంలోని విద్యుత్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 16 కేవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వినియోగిస్తూ.. ఓవర్‌లోడ్‌తో ఇబ్బందులు పడుతున్న రైతుల కోసం అదనంగా 25 కేవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నామని వివరించారు. వాస్తవానికి దీన్ని ఏర్పాటు చేయాలంటే రూ.రెండు లక్షల వరకు ఖర్చవుతుందని, అయితే రూ.12,600ను అడిషనల్ ఓవర్‌లోడ్ కింద చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్ల జియో ట్యాగింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వినియోగదారులకు అందించే సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు చేపడతామని చెప్పారు. విద్యుత్ బిల్లింగ్‌ను ఐఆర్డీఏ పద్ధతిలో చేపట్టాలని సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, మధు, జయకృష్ణారెడ్డి, శ్రీధర్, పరంధామయ్య, రాఘవేంద్రం, జనార్దన్, ఇస్మాయిల్, ప్రసన్న, బెనర్జీ, డీఈఈ సురేష్ బాబు, ఏఈ నరసింహారావు పాల్గొన్నారు.

ఒంగోలులో 'శుభమస్తు' ప్రారంభం



వస్త్రాలను ప్రదర్శిస్తున్న శ్రీముఖి

ఒంగోలు: పట్టణంలోని ఆర్టీసీ డిపో పక్కన శుభమస్తు షాపింగ్ మాల్‌ను అట్టహాసంగా శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా బాలినేని సతీమణి బాలినేని శచీదేవి, యాంకర్ శ్రీముఖి హాజరయ్యారు. ఈ సందర్భంగా శచీదేవి మాట్లాడారు. శుభమస్తు షాపింగ్ మాల్ వస్త్ర ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోందని చెప్పారు. అనంతరం శ్రీముఖి మాట్లాడారు. ఇప్పటికే నెల్లూరు, విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, గుంటూరులో షోరూమ్‌లు ఉన్నాయని, తాజాగా ఒంగోలులో ఆరో బ్రాంచ్‌ను ప్రారంభించారని వివరించారు. షాపింగ్ మాల్ ఎండీ బయ్యా శ్రీనివాసులు, వెంకటరవికుమార్, శ్రీనివాస రాణా ప్రతాప్ మాట్లాడుతూ.. తమకు ఇప్పటి వరకు ఒంగోలుతో రక్త సంబంధం మాత్రమే ఉందని, ఇక నుంచి వ్యాపార బంధం కూడా ప్రారంభమైందన్నారు. ప్రతి వెయ్యి రూపాయల వస్త్రాల కొనుగోలుపై రూ.100 విలువైన గిఫ్ట్ కూపన్‌ను ఈ నెల 12 వరకు ఉచితంగా ఇవ్వనున్నామని, వీటిని ఏడాదిలోపు ఎప్పుడైనా వినియోగించుకోవచ్చని తెలిపారు.



నిమ్మ ధరలు
పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.6

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.112
లేయర్	రూ.113
బ్రాయిలర్ చికెన్:	రూ.200
స్కిన్‌లెస్ చికెన్:	రూ.220
లేయర్ చికెన్:	రూ.192

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా



కావలి: తెనాలిలో నిర్వహించిన 19వ నేషనల్ జంప్ రోప్ అండర్ - 12 పోటీల్లో కావలి రూరల్ మండలం కొత్తసత్రం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జ్యోతి, సరిత ఉత్తమ ప్రతిభ చూపి స్వర్ణ పతకాలు సాధించారు. ఈ క్రమంలో పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీడీ మురళి తదితరులు పాల్గొన్నారు.